


# ఆర్టీసీలో ఫెవికాల్ వీరులు

- ఐదేళ్లు పైబడినా... తిష్ట వేసిన ఉద్యోగులు
- ఇంక్రిమెంట్లు, పదోన్నతుల్లో బేరాలాట
- అద్దెబస్సుల, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులో చేతివాటం
- చోద్యం చూస్తున్న అధికారులు
- నిద్రావస్థలో విజిలెన్స్ అధికారులు



కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 1: అది ఖ్యాతిగాంచిన ఏపీఎస్ఆర్టీసీ కడప రీజియన్‌కు చెందిన ప్రధాన కేంద్ర కార్యాలయం (ఆర్ఎం ఆఫీసు). అందులో నే ఈడీ కార్యాలయం... పక్కనే కడప డిపో మేనేజర్ కార్యాలయం.. వర్క్‌షాపులు ఉన్నాయి. ఇందులో వివిధ హోదాలలో (సీనియర్ అసిస్టెంట్స్, డిప్యూటీ సూపరింటెండెంట్స్, అసిస్టెంట్ మేనేజర్స్) పనిచేసే ఉద్యోగులు ఏళ్ల తరబడి ఇక్కడే పాతుకుపోయి విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీరంతా వాస్తవానికి సంబంధిత కడప రీజియన్‌కు చెందిన (కడప - మైదుకూరు - ప్రొద్దుటూరు - జమ్మలమడుగు - పులివెందుల - బద్వేల్) ఆర్టీసీ ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, అలవెన్సులు చూసేందుకు, సమకూర్చేందుకు వీలుగా సేవలందించాల్సి వుంది. డిపో మేనేజర్ స్థాయి నుంచి ఆపై స్థాయి అధికారుల ఆదేశాల మేరకు పనిష్మెంట్లను పక్కాగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సి వుంది. ఇక వీరి తాలూకు పనితీరుపై గతంలో (ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాకముందు) మూడంచెల పర్యవేక్షణ వుండేది. ఎప్పుడైతే ఆర్టీసీ ప్రభుత్వంలో (2020 జనవరి 1న) విలీనం అయ్యిందో.. అప్పటి నుంచి వీరి కత్తికి ఎదురేలేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉద్యోగుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

ఉద్యోగులకు రావాల్సిన ఇంక్రిమెంట్లు, అలవెన్సులు, పదోన్నతులు విషయంలో తీవ్ర జాప్యం చేస్తూ వేధిస్తున్నారనే విమర్శలున్నాయి. పైపెచ్చు ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, అలవెన్సులు, పదోన్నతులు త్వరితగతిన అందాలన్నా... జరగాలన్నా ఆమ్యామ్యాలు ముందస్తుగా చెల్లించేలా బేరాలాట సాగుతున్నట్లు సమాచారం. ఇదిలా వుండగా ఆర్టీసీలో అద్దెబస్సుల బిల్లులు, కాంట్రాక్టర్ల బిల్లులు, షాపుల అద్దెలు.. తదితర వాటిని సక్రమంగా చేయకుండా ఇటు సంస్థకు అటు ప్రభుత్వానికి నష్టం కలిగించేలా విధులు నిర్వహిస్తు న్నారనే విమర్శలున్నాయి. వారికి నచ్చిన కొంతమంది ఉద్యోగులకు ఆర్థికంగా లాభ పడేలా చేశారనే ఆరోపణలున్నాయి. ఆ కోవలో ఇదివరకు పులివెందుల డిపోలో కొంతమంది ఉద్యోగుల ఇంక్రిమెంట్ల విషయంలో ఆర్థిక లాభం కలిగించేలా చేతివాటం ప్రదర్శించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ విషయంలో జిల్లా అధికారులు విచారణ జరిపి నిజానిజాలు నిగ్గుతేల్చినా.. వాటిని తొక్కిపెట్టినట్లుగా ఉద్యోగుల్లో చర్చసాగుతోంది.

ఈనెల 23న ప్రొదుటూరు డిపోలో విజయవాడ హెడ్ ఆఫీసు నుంచి వచ్చిన విజిలెన్స్ ఉన్నతాధికారులు తనిఖీ చేయగా పలు అవకతవకలు... అవినీతికి పాల్పడ్డారని నిర్ధారించినట్లు సమాచారం. అదే తరహాలో జిల్లాలోని అన్ని డిపోలలో ఇంక్రిమెంట్లు, పదోన్నతుల తీరుపై సమగ్ర విచారణ జరిపితే ఎంతమందికి ఉద్యోగాలు ఊడిపోతాయో చెప్పలేని పరిస్థితి. అయినప్పటికీ మాకెందుకనే తరహాలో పైస్థాయి అధికారులు.. ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు గుంభనంగా వున్నారనే ఆరోపణలున్నాయి. ఏదిఏమైనా ఏళ్ల తరబడి పాతుకుపోయి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను కనీసం మూడు సంవత్సరాలకు ఓసారైనా ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తే కొంతవరకైనా ఇటువంటి అవినీతి, అవకతవ కలు జరగకుండా అడ్డుకట్ట వేయవచ్చని కొంతమంది ఉద్యోగులు బహిరంగంగా చెబుతు న్నారు. తద్వారా కింది స్థాయి ఉద్యోగులైన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, శ్రామిక్‌లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి న్యాయం జరిగే అవకాశం వుంది.

**అవినీతి జరిగినట్లు తేలితే చర్యలు ..**

ఆర్టీసీలో అవినీతికి చోటులేదు. ఒకవేళ అవినీతి, అక్రమాలు చేసినట్లుగా నిగ్గుతేలితే అది ఏస్థాయి ఉద్యోగులు అయినా సంస్థ చర్యలు తీసుకుంటుంది.

- గోపాల్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, కడప

## జిల్లాకు 48 మంది తహశీల్దార్ల కేటాయింపు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 1: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జోన్-4 పరిధి లోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి వైఎస్సార్ కడప జిల్లాకు 48 మంది తహశీల్దార్లను కేటాయించారు. వీరిని మండలాల వారీగా నియమిస్తూ కలెక్టర్ విజయరామరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

**మండలాల వారీగా తహశీల్దార్లు**

కె.కుప్పయ్య కాశినాయన మండలం, ఎస్.శివప్రసాద్ కడప, కె.వెంకటరమణ కడపఅర్బన్, వై.రమేశ్‌బాబు కడప ఆర్డీవో ఏఓ, కేపీ భాగ్యలక్ష్మి సీకేదిన్నె, ఎస్.ప్రమీల కలెక్టరేట్ ఇ-సెక్షన్ సూపరింటెండెంట్, ఐ.సుబ్రమణ్యం కమలాపురం, జె. రాము ఒంటిమిట్ట, సి.కరుణాకర్ జమ్మలమడుగు, బి.బెన్నురాజ్ చక్రాయపేట, ఈ.అమర్‌నాథ్ వీరపునాయునిపల్లి, ఐ.విజయశ్రీ రాజుపాలెం, ఎన్ఎస్ కృష్ణకుమార్ కలసపాడు, జిలాని తొండూరు, బీవీఎస్ విద్యాసాగర్ ప్రొద్దుటూరు, కె.శ్రీధర్ కలెక్టరేట్ సి-సెక్షన్, టీఆర్ జమానుల్లాఖాన్ లింగాల, వై.నరేంద్రనాథ్‌రెడ్డి మైదుకూరు, ఎస్.ప్రకాశ్‌బాబు చెన్నూరు తహశీల్దారుగా నియమితులయ్యారు. అలాగే ఎం.బీమేశ్వరరావు సింహాద్రిపురం, నిత్యానంద రాజులు బద్వేలు ఆర్డీఓ ఏఓ, ఎం.రోషయ్య గోపవరం, పి.రాజేశ్వరి కడప డి-సెక్షన్, పి.వెంకటలక్ష్మమ్మ జమ్మలమడుగు ఆర్డీవో ఏవో, వెంకటేశ్‌నాయక్ వేంపల్లి, ఎం.వేణుగోపాల్ అట్లూరు, కె.అమర్‌నాథ్ వల్లూరు, డి.రవికుమార్ పులివెందుల ఆర్డీవో ఏవో, ఎస్.వెంకటరమణ మైలవరం, ఎస్.మహేశ్వరిబాయ్ బి.కోడూరు, ఇ.వెంకటలక్ష్మి ఖాజీపేట, జి.సౌజన్యలక్ష్మి యర్రగుంట్ల, సి. చంద్రశేఖర్ వర్మ పెండ్లిమర్రి తహశీ ల్దారుగా నియమితులయ్యారు. యు. మధుసూదన్‌రావు బద్వేలు, జి.ఉమారాణి దువ్వూరు, సి.శ్రీనివాసులు కొండాపురం, కె.ధనుంజయులు కలెక్టరేట్ హెచ్-సెక్షన్, టీవీ రమేశ్‌బాబు పులివెందుల, నట్వ రవికుమార్ పెద్దముడియం, పి.భారతి కలెక్టరేట్ జి-సెక్షన్, పి.శిరీష పోరుమామిళ్ల, వీఎస్‌వీఆర్ క్రిష్ణ కేఆర్ఆర్ సి-కడప, ఎం.భాగవతి వేముల, వి.పుల్లారెడ్డి కలెక్టరేట్ జె-సెక్షన్, పి.శివరామన్ బి.మఠం, బి.శ్రీనివాసులు ముద్దనూరు, సువర్ణాదేవి జమ్మలమడుగు కేఆర్ఆర్‌సీ, ఎస్.మురాషావలి సిద్దవటం తహశీల్దార్లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## జిల్లాకు 17 మంది ఎంపీడీవోలు రాక

కడప(రూరల్), ఫిబ్రవరి 1: త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఇటీవల 32 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీచేశారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి గురువారం 17 మంది ఎంపీడీవోలు ఉమ్మడి జిల్లాకు బదిలీ అయ్యారు. వీరికి ఆయా మండలాల్లో పోస్టింగ్ ఇచ్చారు.

బి.శివమల్లేశ్వరప్ప బి.మఠం ఎంపీడీవోగా, ఎం.ఫజుల్ రహీమ్ మైదుకూరు, పి.మధుసూధనరెడ్డి కాశినాయన, కేవీ సుబ్రమణ్యం గోపవరం, ఎన్.ఉమామహేశ్వరరావు సిద్దవటం, యస్.అమానుల్లా అట్లూరు, ఎస్.సుగుణశ్రీ దువ్వూరు, వి.రజనీకాంత్ బద్వేలు, కేవీ కోటేశ్వరరావు కలసపాడు, జీఎస్ రామచంద్ర ఒంటిమిట్ట, కె.తేజోష్ణ లింగాల, ఎస్.షకీల బేగం సీకే దిన్నె, బి.విజయభాస్కర్ వల్లూరు, జి.లక్ష్మీనరసింహ పెద్దముడియం, పి.దివాకర్ పులివెందుల, జె.సోలమన్ సింహాద్రిపురం, పి.మహబూబ్‌బీ చాపాడు మండలాలకు కేటాయించారు. వీరిలో చాలా మంది గురువారం బాధ్యతలు చేపట్టారు.

## పలువురు సీఐలు, ఎస్ఐల బదిలీ

కడప (క్రైం), ఫిబ్రవరి1: కర్నూలు రేంజ్ పరిధిలో ఎన్నికల నిబంధనల మేరకు పలువురు సీఐలు, ఎస్ఐలను బదిలీచేస్తూ డీఐజీ సెంథిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఐదుగురు సీఐలు, 17 మంది ఎస్ఐలు జిల్లాకు బదిలీ అయ్యారు.

అన్నమయ్య జిల్లా అటాచ్డ్‌లో ఉన్న సీఐలు రాంభూపాల్, మనోహర్, దస్తగిరి కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు. అలాగే అనంతపురం రేంజ్ నుంచి శ్రీనివాస్‌నాయక్ కడప సీసీఎస్‌కు, కడప వీఆర్ నుంచి సుదర్శన్‌ప్రసాద్ అనంతపురానికి బదిలీ అయ్యారు. ఇక కర్నూలు వీఆర్‌లో ఉన్న 17 మంది ఎస్ఐలు జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లకు బదిలీ అయ్యారు. వెంకటరెడ్డి వీఎన్‌పల్లె ఎస్ఐగా, సోమ్లానాయక్ ప్రొద్దుటూరు త్రీటౌన్, సుబ్బరాయుడు ప్రొద్దుటూరు టూటౌన్, వి.నాగేష్ కడప ట్రాఫిక్, ఆర్.శ్రీనివాసులు సీసీఎస్ కడప, రాధాక్రిష్ణ ప్రొద్దుటూరు ట్రాఫిక్, ఎర్రన్న కడప రిమ్స్, మహ్మద్ ఆలీఖాన్ కడప టూటౌన్, ఎంసీ రంగయ్య డీటీఆర్‌బీ కడప, నజీర్‌హుసేన్ కడప ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ అయ్యారు. అలాగే.. వెంకటరమణ సీసీఎస్ కడప, మల్లికార్జున ఫ్యాక్షన్‌జోన్ కడప, నిర్మలాదేవి ఏహెచ్‌టీయూ కడప, టి.కల్పన జమ్మలమడుగు, టీవీఎస్ చిరంజీవి ఎర్రగుంట్ల, ఉమాపతి డీఎస్‌బీ, సీహెచ్ పుల్లయ్య డీటీసీ కడపకు బదిలీ అయ్యారు.

# వైసీపీలో అసమ్మతి సెగలు

- ఇప్పటికే ముఖ్యనేతలు సైకిలెక్కిన వైనం
- ముద్దనూరులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దగ్గరి బంధువు టీడీపీలోకి..
- దీనిని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే వీరంగం
- ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లుకు వ్యతిరేకంగా కౌన్సిలర్ల స్వరం
- బద్వేలులో ఎమ్మెల్సీపై తిరుగుబాటు

**వైనాట్ 175 పేరుతో కుప్పంలో కూడా గెలుస్తామంటూ జగన్ శిబిరం రంకెలేస్తోంది. కుప్పంను అటుంచితే ఈసారి సీఎం జగన్ అడ్డాలో వైసీపీకి ఎదురుగాలి వీస్తోందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. జగన్ నాలుగున్నరేళ్ల పరిపాలనలో అభివృద్ధి గురించి పక్కనబెడితే వైసీపీ అండ్ కో చేసిన ఆగడాలే కలకలం రేపాయి. భూకబ్జాలు, ఇసుక, గ్రావెల్ మాఫియాతో కోట్లు సంపాదించుకున్నారని చెబుతారు. అయితే జగన్ పార్టీ పెట్టిన తరువాత వైసీపీ జెండా మోసి భుజాలరిగిన కార్యకర్తలకు కాకుండా.. భజన చేసిన వారికే ప్రాధాన్యం పెరిగిందని చెబుతారు. ఇది జీర్ణించుకోలేకనే జిల్లా వ్యాప్తంగా వైసీపీలో అసమ్మతి సెగలు రేగడంతో పలువురు సైకిలెక్కుతున్నారు.**



(కడప-ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అంటేనే రెండో ముంబై. ఈ పట్టణం బంగారు ఇతరత్రా వ్యాపారాలకు ప్రసిద్ధి. ఇక్కడ వచ్చే ఆదాయం, ఇతరత్రా వాటిని పరిశీలిస్తే కార్పొరేషన్‌కు అనువైన పట్టణం. స్థానికంగా ఉన్న కొందరు నేతలు దీన్ని ఎదుగు బొదుగు లేని టౌన్‌గా మార్చారనే విమర్శ ఉంది. జగన్ సీఎం కావడంతో ప్రొద్దుటూరు రూపురేఖలు మారుతాయని అందరూ భావించారు. అవినీతి అక్రమాల్లో మిగతా నియోజకవర్గాలను తలదన్నేలా ప్రొద్దుటూరు రూపు రేఖలు మారాయే కానీ అభివృద్ధిలో మాత్రం కాదనే విమర్శలున్నాయి.

**ఎమ్మెల్యే వర్సెస్ వైసీపీ**

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారంటూ ఆయన ప్రత్యర్థులు ఆరోపిస్తుంటారు. ఇటీవల వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, కౌన్సిలర్లే ఎమ్మెల్యే తీరును తూర్పారబడుతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఓ గ్రూపు కట్టారు. ఎమ్మెల్యే వ్యవహార శైలిని నిరసిస్తూ ప్రొద్దుటూరు, రాజుపాలెం నుంచి పలువురు శివచంద్రారెడ్డి వెంట నడుస్తూ వస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రొద్దుటూరు టికెట్ తనకే ఇవ్వాలని శివచంద్రారెడ్డి కోరుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రొద్దుటూరు మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇక్కడ 41 మంది కౌన్సిల ర్లు ఉన్నారు. 5, 19, 13, 22 వార్డు కౌన్సిలర్లు ఎమ్మెల్యే ను నిలదీస్తారనే భయంతో సమావేశానికి మీడియాను అనుమతించలేదని చెబుతారు. దీంతో మీడియా వారు బయట ధర్నా చేశారు. మీడియా లేని సమావేశానికి మేమెందుకు అంటూ ఆ నలుగురు కౌన్సిలర్లు బయటికి వచ్చేసి ధర్నా చేస్తున్న మీడియా వారికి సంఘీభావం ప్రకటించారు. ఇక ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 41 మంది కౌన్సిలర్లలో 39 మంది వైసీపీ బ్యాచే. ఇక్కడ బీసీ వర్గానికి చెందిన కొందరు కౌన్సిలర్లు అసమ్మతితో రగిలిపోతున్నారు. 3, 31, 39 వార్డుల కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెబుతారు.

**టీడీపీలోకి వలసలను**

**అడ్డుకునేందుకు దాడులు**

సీఎం జగన్‌కు సొంత జిల్లాలో ఝులక్ ఇచ్చేందుకు ఈసారి మెజార్టీ స్థానాలను గెలుచుకోవాలనే లక్ష్యంతో టీడీపీ అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇందులో భాగంగా ముద్దనూరుకు చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమీప బంధువు గంగవరం శశిధర్‌రెడ్డి జనవరి 19న కమలాపురంలో జరిగిన చంద్రబాబు సమావేశంలో టీడీపీలో చేరారు. శశిధర్‌రెడ్డి తన అనుచరులను టీడీపీలో చేర్పించేందుకు ఆయన ఇంటి వద్ద బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన అనుచరులతో వెళ్లి శశిధర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. బలవంతంగా ఆయనను లాక్కుపోయారు. దీంతో అక్కడ ఉన్న టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దిగారు. ఇరుపార్టీల గొడవతో పోలీసులు చేతులెత్తేశారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి నాలుగురోడ్ల కూడలి వద్దకు చేరుకుని అక్కడ బైఠాయించారు. పోలీసులు ఆయనను బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అప్పటికే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వీరవిహారం చేశారు. ఇరువురూ పోలీసుస్టేషన్ చేరుకోవడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భూపేశ్‌రెడ్డి ఫ్యామిలీపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరుష పదజాలంతో దూషించారు. బలవంతంగా వైసీపీ వారిని టీడీపీలో చేర్చుతున్నట్లు ఆరోపించారు. అయితే ఎమ్మెల్యే అరాచకాలు భరించలేక తాము టీడీపీలో చేరుతున్నామని వైసీపీ నేతలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని గట్టిగా చెప్పారు.

**గోవిందరెడ్డికి వ్యతిరేకంగా..**

బద్వేలు నియోజకవర్గంలోనూ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి వ్యతిరేకంగా ఓ వర్గం రగిలిపోతోంది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పోరుమామిళ్లకు చెందిన విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ అసమ్మతి నేతలు భేటీ అయ్యారు. నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు, మాజీ మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు, మండలస్థాయి నాయకులు, 24 మంది సర్పంచ్‌లు, 20 మంది ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. వీరంతా గోవిందరెడ్డి, ఆయన అనుచరుల తీరును ఎండగట్టారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సుధాకు టికెట్ ఇస్తే తాము అంగీకరించేది లేదని హెచ్చరించారు.

**సీఎం వైఎస్ జగన్‌కే ఝులక్**

వారం క్రితం తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే భేటీ అయ్యారు. సర్వేలో నీకు వ్యతిరేకత ఉందని తేలింది, ఈ సారి నీకు టికెట్ ఇచ్చేది లేదని సీఎం చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ ఎమ్మెల్యే.. "నేనేమన్నా హత్యలు చేసినానా.. నాపైనేనా వ్యతిరేకత.. నీ పైన లేదా" అని జగన్ ప్రశ్నించారని సమాచారం. అంతటితో ఆగని ఆయన సీఎంను కలిసి బయటకు వచ్చిన తరువాత.. తనకు కాకుండా వేరే వాళ్లకు టికెట్ ఇస్తే ఎలా గెలుస్తారో చూస్తా అంటూ హెచ్చరించారని అంటున్నారు. అంటే.. సీఎం సొంత జిల్లాలో ఎమ్మెల్యేలపైన కార్యకర్తలకే కాదు.. సీఎంపైన ఎమ్మెల్యేల్లోనూ అసంతృప్తి ఉందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఆర్ఐవోగా బండి వెంకటసుబ్బయ్య



కడప(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి1: ఇంటర్మీడియట్ రీజనల్ ఇన్‌స్పెక్టరు(ఆర్ఐవో)గా బండి వెంకటసుబ్బయ్యను బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పులివెందుల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన గురువారం కడప నగరం ఆర్ఐవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆర్ఐవోగా విధులు నిర్వహిస్తున్న సుబ్బరాజు తన పూర్వ ప్రిన్సిపల్ విధుల్లో చేరనున్నారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ థియరీ పరీక్షల్లో బోర్డు ఆదేశాల మేరకు పకడ్బందీగా నిర్వహించి జిల్లాలో ఉత్తీర్ణత శాతం మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్ఐవోను డీవీఈవో శ్రీనివాసరెడ్డి, డీసీఈసీ సభ్యులు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

## బావిలో పడ్డ కారు

- అరటి వ్యాపారి, అతని డ్రైవర్ మృతి
- మృతులు ఢిల్లీ వాసులు



లింగాల మండలం ఇప్పట్ల సమీపంలో బావిలో పడిన కారు

లింగాల, ఫిబ్రవరి 1: లింగాల మండలంలో బుధవారం రాత్రి ఓ కారులో బావిలో పడ్డంతో ఇద్దరు మృతి చెందారు. మృతులిద్దరూ ఢిల్లీ వాసులు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

ఢిల్లీకి చెందిన సుశీల్‌కుమార్ ఖిల్వాని (54) కొన్నేళ్లుగా అరటి వ్యాపారం చేస్తున్నారు. అరటి సీజన్ ప్రారంభం కావడంతో వ్యాపారం నిమిత్తం నెలన్నరక్రితం పులివెందులకు వచ్చారు. అతని వద్ద ఢిల్లీకే చెందిన ప్రకాశ్ బురా ఠాకూర్ (60) అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరు ఢిల్లీ నుంచి వచ్చిన మరికొందరు కూలీలతో కలసి పులివెందులలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటూ తమ వ్యాపారం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరూ బుధవారం రాత్రి డీఎల్ 12సిబి 4632 కారులో వెళ్లి అనంతపురం జిల్లా నార్పల మండలం గడ్డనాగేపల్లె వద్ద అరటిని లోడ్ చేయించి తిరిగి పులివెందులకు లింగాల మీదుగా 9గంటల ప్రాంతంలో బయలుదేరారు. తాను ఇంటికి వస్తున్నానని ఫోన్ చేసి చెప్పిన సుశీల్‌కుమార్ ఖిల్వాని రాత్రి 10గంటలు అవుతున్నా రాకపోయేసరికి అతని వద్ద పనిచేసే వ్యక్తి ఫోన్ చేయడంతో స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో అతను నార్పల మండలానికి వెతుకుతూ బయలుదేరారు. లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వద్ద రోడ్డు పక్కన బావి వద్ద ఉన్న రక్షణ గోడకు వాహనం ఢీకొట్టిన ఆనవాళ్లు గుర్తించారు. హుటాహుటిన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని సంఘటన స్థలంలో ప్రమాదం ఆనవాళ్లు గుర్తించారు. కారు బావిలో పడిపోయినట్లు నిర్ధారణకు వచ్చారు. గురువారం పులివెందుల రూరల్ సీఐ మద్దిలేటి, ఎస్ఐ కృష్ణయ్య పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ప్రజలు కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో బావి చుట్టూ ఉన్న మట్టిని తొలగించి క్రేన్ సహాయంతో ఇద్దరు మనుషులను దింపి బావిలోకి కారును బయటకు లాగేందుకు ప్రయత్నించారు. దాదాపు ఆరుగంటలు శ్రమించి ఉదయం 11గంటలకు కారును బయటకు తీశారు. అందులో సుశీల్‌కుమార్ ఖిల్వాని, డ్రైవర్ ప్రకాశ్‌బురా ఠాకూర్ మృతిచెంది ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే సుశీల్‌కుమార్ ఖిల్వాని కుమారులు ఇద్దరు ఢిల్లీ నుంచి వచ్చారు. ఖిల్వానికి సంబంధించిన వ్యక్తి వెన్నపూస మహమ్మద్ రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్ణయ్య తెలిపారు. కాగా.. కారు బావిలో ఎలా పడిందనే విషయం ఎవరికి అంతుబట్టనిదిగా ఉంది. ఏదైనా వాహనం అడ్డు వచ్చిందా, కారు బ్రేక్ ఫెయిల్ అయిందా, టైరు పేలి అదుపు తప్పిందా, డ్రైవర్ అనారోగ్యమా లేక నిద్రమత్తు కారణమా అనే వివరాలు తెలియరాలేదు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తేలనున్నాయి.



సుశీల్‌కుమార్ ఖిల్వాని, డ్రైవర్ ప్రకాశ్ బురా ఠాకూర్ మృతదేహాలు

## రూ.10 కోట్ల భూమి కబ్జా

- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూమి రిజిస్టరు
- హెడ్‌కానిస్టేబుల్ వీఎం బాషాతో పాటు..
- సబ్‌రిజిస్ట్రారు, మరో ఇద్దరిపై కేసు నమోదు

కడప (క్రైం), ఫిబ్రవరి1: దాదాపు రూ.10 కోట్లకు పైగా విలువచేసే స్థలం కబ్జా కావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఓ హెడ్ కానిస్టేబుల్, ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాలూకా సీఐ రాజా, బాధితుడు తెలిపిన వివరాల మేరకు..

కడప నగర శివారులోని గూడూరు గ్రామ పొలం సర్వే నెం.147/ఇ/4ఇలో పంటపొలాన్ని 1981లో కడపకు చెందిన శ్రీనివాసరెడ్డి కొనుగోలు చేశాడు. ఈ స్థలంపై కన్నేసిన హెడ్‌కానిస్టేబుల్ వీఎం బాషా 2023 మార్చిలో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ సుందరేశన్ సహకారంతో నకిలీ డాక్యుమెంట్లు తయారు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ తన సోదరి గుల్జార్‌బేగం పేరుతో ఆ స్థలాన్ని రిజిస్టరు చేయించారు. నకిలీ డాక్యుమెంట్ల ద్వారా రిజిస్టరు చేయించుకున్న స్థలాన్ని ఇతరులకు రిజిస్టరు చేయించారు. ఈ మేరకు అక్కడ నిర్మాణాలు చేపట్టారు.

దీనిపై బాధితుడు శ్రీనివాసరెడ్డి తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హెడ్‌కానిస్టేబుల్ వీఎం బాషా, ఆయన సోదరి గుల్జార్ బేగం, రూరల్ సబ్‌రిజిస్ట్రార్ సుందరేశన్, గజరాంపల్లె మనోహర్‌రావుపై ఐపీసీ 420, 468, 471, 120బి, రెడ్‌విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- రూ.1577.23 లక్షలతో ప్రణాళిక
- ప్రజల దాహార్తికి రూ.1085.61 లక్షలు
- పశువుల దాహార్తికి రూ.232.46 లక్షలు
- 1883 గ్రామాల్లో నీటిఎద్దడి
- 2,53,941 ట్యాంకర్ల నీటి అవసరం



కడప (రూరల్), ఫిబ్రవరి 1: వేసవికాలం ప్రారంభమైంది. సూర్యుడు రోజురోజుకు మండిపోతున్నాడు. ఈ కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో మంచి నీటి ఎద్దడి తరుముకొస్తోంది. ఈ ప్రమాదాన్ని గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యశాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ముందస్తుగా గుర్తించింది. జిల్లాలోని 36 మండలాల నీటివనరుల స్థితిగతులను, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని నీటిఎద్దడిని అంచనా వేసింది. ఈ మేరకు జనవరి 24 నుంచి జూన్ 24 వరకు రూ.1577.23 లక్షలు అవసరం అవుతుందంటూ డ్రాట్ యాక్షన్ ప్లాన్ తయారుచేసి ప్రభుత్వానికి పంపారు.

ఇందులో 1194 గ్రామాల్లో ప్రజలు నీటిఎద్దడి బారిన పడనున్నారని గుర్తించారు. ఇందుకు 2,08,856 ట్యాంకర్ల నీటి సరఫరాకు గాను ఒక్కొక్క ట్యాంకర్‌కు రూ.519.75 చొప్పున మొత్తం రూ.1085.61 లక్షలు అవసరం అని పేర్కొన్నారు. అలాగే 689 గ్రామాల్లో పశువులు నీటిఎద్దడి బారిన పడనున్నాయని ఈ మేరకు వాటికి నీటిని సరఫరా చేసేందుకు 45,085 ట్యాంకర్లకు గాను రూ.232.46 లక్షలు కావాలని తెలిపారు. అలాగే మరో 44 గ్రామాల్లో 44 వ్యవసాయ బోరుబావులను అద్దెకు తీసుకోవాల్సి ఉందని ఇందకు రూ.0.12 లక్షలు అవసర అని తెలిపారు. 300 బోరుబావుల డీపింగ్‌కు రూ. 245.54 లక్షలు అవసరంగా ప్రతిపాదనలలో పేర్కొన్నారు. ఇందులో జనవరి 24 నుంచి ఫిబ్రవరి 24 వరకు 27 మండలాల్లోని 140 గ్రామాలకు గాను రూ.186.02 లక్షలు, ఫిబ్రవరి 24 నుంచి మార్చి 24 వరకు 28 మండలాల్లో 169 గ్రామాలకు గాను రూ.214.89 లక్షలు, మార్చి 24 నుంచి ఏప్రిల్ 24 వరకు 29 మండలాల్లో 216 గ్రామాలకు రూ. 276.45 లక్షలు, ఏప్రిల్ 24 నుంచి మే 24 వరకు 30 మండలాల్లో 240 గ్రామాలకు గాను రూ.310.37 లక్షలు, మే 24 నుంచి జూన్ 24 వరకు 30 మండలాల్లో 259 గ్రామాలకు గాను రూ.294.68 లక్షలు, జూన్ 24 నుంచి జూలై 24 వరకు 30 మండలాల్లో 258 గ్రామాలకు గాను రూ.294.82 లక్షలు అవసరంగా పేర్కొన్నారు. ఈ మేరకు నీటిఎద్దడి గ్రామాల ప్రజలకు, అక్కడి పశువులకు తాగునీటి సరఫరాకు మొత్తం రూ.1577.23 లక్షలు అసరంగా ప్రతిపాదనలు తయారుచేసి ఈఎంసీకి పంపారు.

**2,53,941 ట్యాంకర్ల నీరు అవసరం..**



వేసవి ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాం. జనవరి 24 నుంచి జూన్ 24 వరకు డ్రాట్ యాక్షన్ ప్రణాళికను తయారుచేసి రూ.1577.23 లక్షలు అవసరం అంటూ ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. వేసవి కాలం మొత్తంలో 1883 గ్రామాలల్లో ప్రజలు, పశువుల నీటి అవసరానికి గాను 2,53,941 ట్యాంకర్ల నీటి సరఫరా చేయాల్సి ఉంటుందని అంచనా వేశాం.


- వీరన్న, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

# వందేళ్లు దాటినా అభివృద్ధికి దూరం

ఈ పాఠశాల ఎందరికో అభివృద్ధి బాటలు వేసింది. పాఠశాలలో చదివిన చాలా మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారు. కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లు గానూ, మరికొందరు ఎమ్మెల్యేలుగా చరిత్ర పుటల్లోకి ఎక్కారు. అలాంటి పాఠశాల దీనస్థితి చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. పాఠశాల భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలోనే బ్రిటీష్ పాలన నుంచి విద్యార్థులకు విద్యనందించిన ఈ సరస్వతి నిలయం అభివృద్ధికి ఎప్పుడు నోచుకుంటుందోనని ఎందరో విద్యావంతులు, విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.



నందలూరులోని ఐఏఎస్‌ల పాఠశాలగా గుర్తింపు పొందిన సరస్వతీ నిలయం



ఎప్పుడు కూలుతుందో తెలియని రెండు అంతస్తుల భవనం

- షిఫ్ట్ పద్ధతిలో కొనసాగుతున్న పాఠశాల, కళాశాల తరగతులు
- కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు
- పట్టించుకునే నాథుడే కరువు
- ఎందరో ఐఏఎస్, ఐపీఎస్‌లను అందించిన పాఠశాల దీనస్థితి



కాలం చెల్లిన పరిపాలనా భవనం

నందలూరు, ఫిబ్రవరి 1: రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు జడ్పీ పాఠశాల ఐఏఎస్‌లను అందించిన పాఠశాలగా చరిత్రకెక్కింది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఈ పాఠశాలలో చదివిన ప్రతిఒక్కరూ అభివృద్ధిలో ముందుకెళ్తున్నారు. అలాంటి పాఠశాల దుస్థితి నేడు దారుణంగా తయారైంది. అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి దూరమైంది. రాజంపేట నియోజకవర్గాన్ని నాటి నుంచి నేటి వరకు పాలించిన ఎమ్మెల్యేలంతా నందలూరు వాసులు కావడం గమనార్హం. దీంతో పాటు పాఠశాల ఇప్పటికే నూతన సొబగులతో కార్పొరేట్ పాఠశాలలు తలదన్నేలా అభివృద్ధిలో అడుగులు వేయాల్సి ఉంది. అయితే పాలకుల నిర్లక్ష్యమో అధికారుల అలసత్వమో అర్థం కావడం లేదు. భవనాల మధ్య బిక్కుబిక్కుమంటూ నెట్టుకొస్తారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఈ ఐఏఎస్‌ల పాఠశాల పరిస్థితి మారింది. అనేక సంవత్సరాలుగా అభివృద్ధిలో వెనకడుగు వేస్తూనే ఉంది. 1908లో ఏర్పాటు చేసిన ఈ జిల్లా పరిషత్ పాఠశాల నేడు దయనీయ స్థితికి చేరుకుంది. ఎప్పుడు ఏ భవనం కూలుతుందోనని అటు విద్యార్థులతో పాటు ఇటు గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన భవనాలను ఎందుకు తొలగించడం లేదో అంతుపట్టని విషయంగా మారింది. పరిపాలన భవనం కూడా కాలం చెల్లింది. ఇప్పటికే స్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో ఉపాధ్యాయులు, సిబ్బంది నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం నెట్టుకొస్తున్నారు. పాఠశాల దుస్థితి.. స్థానిక ప్రజాప్రతినిధులకు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు తెలిసినా ఎటువంటి ప్రయోజనం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాలం చెల్లిన భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు కోరుతున్నారు. కాగా కాలం చెల్లిన భవనం వెనుకవైపు దాదాపు రూ.23 లక్షలతో అదనపు తరగతి గదులను నిర్మించడం గమనార్హం.

### పాఠశాలలోనే కళాశాల తరగతులు

ఉన్న భవనాలు అంతంత మాత్రమే.. మరి ఇలాంటి తరుణంలో జడ్పీ పాఠశాల భవనాల్లోనే జూనియర్ కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అటు పాఠశాల విద్యార్థులు, ఇటు కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గతంలో పాఠశాల తరగతులు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం ఉదయం పాఠశాల విద్యార్థులకు, మధ్యాహ్నం కళాశాల విద్యార్థులకు షిఫ్ట్ పద్ధతిలో క్లాసులు నిర్వహించడంతో విద్యార్థులు పూర్తి స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. రెండు పూటలా క్లాసులు నిర్వహిస్తే విద్యార్థుల్లో మేధోసంపత్తి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఒకే పూట కావడంతో మిగిలిన సమయంలో విద్యార్థులు వృథాగా తిరుగుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం..



ఉమ్మడి కడప జిల్లాలో ఐఏఎస్‌ల పాఠశాలగా ఖ్యాతి గడించిన ఈ పాఠశాలను ప్రారంభించి 115 సంవత్సరాలు పూర్తయింది. అయినా నేటికీ శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం. ముఖ్యంగా జూనియర్ కళాశాలను కూడా హైస్కూలు భవనాల్లోనే షిఫ్ట్ పద్ధతిలో నిర్వహించడం సరైంది కాదు. ఇప్పటికైనా పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు ముందుకు రావాలి.

- అల్లం అశోక్‌కుమార్, ఎస్టీయూ నేత, నందలూరు

### క్రీడా మైదానం కేటాయించాలి..



పాఠశాలకు కేటాయించిన క్రీడా మైదానం 2కి.మీ. దూరంలో ఉండడం వల్ల విద్యార్థులకు నిరుపయోగంగా మారి, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు కొరవడుతున్నాయి. తల్లిదండ్రుల, గ్రామ ప్రజల, విద్యార్థుల కోర్కె మేరకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. పాఠశాలకు దగ్గరలోనే క్రీడా మైదానం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అంతేకాకుండా పూర్తి స్థాయిలో తరగతుల నిర్వహణను చేపట్టాలి.

- సమ్మెట శివప్రసాద్, మాజీ సర్పంచ్

## బియ్యం పంపిణీ సరిగా జరగకపోతే చర్యలు

ఎండీయూ వాహనాల తనిఖీలో జేసీ గణేశ్‌కుమార్



చెన్నూరులో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న జేసీ గణేశ్‌కుమార్

చెన్నూరు, ఫిబ్రవరి 1 : ప్రతినెలా వినియోగదారులకు అందించే బియ్యం పంపిణీ సక్రమంగా జరగకపోతే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టరు గణేశ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని చెన్నూరు, రామనపల్లె గ్రామాల్లో ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేసే బియ్యాన్ని జాయింట్ కలెక్టరుతో పాటు ఆర్డీవో మధుసూదన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెన్నూరు పూలదొడ్డివీధి, పార్కువీధిల్లో బియ్యం ఎలా పంపిణీ అవుతుంది, ఏ సమయానికి వస్తున్నారు., సక్రమంగా అందిస్తున్నారా లేదా వంటి విషయాలను కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి బియ్యం పంపిణీ జరగాలని, వ్యక్తిగత, ఇతరత్రా కారణాలు చూపిస్తూ బియ్యం పంపిణీ మధ్యలో నిలిపి పంపిణీ చేయడం లాంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది కూడా ప్రతిరోజూ ఎండీయూ వాహనాలపై దృష్టి పెట్టాలని, ఏ చిన్నపాటి సమస్య ఉన్నా తెలపాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఆలీఖాన్, ఆర్ఐ సౌజన్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

## నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ పోటీలకు శివకోటి



శివకోటి

నందలూరు, ఫిబ్రవరి 1: మూడవ మినీ నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ పోటీలకు నందలూరు వాసి అలుసూరి శివకోటి ఎంపికయ్యారు. నేషనల్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ తనను ఎంపిక చేయడమే కాకుండా వైస్ కెప్టెన్‌గా నియమించడం పట్ల అసోసియేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ పట్టణంలో ఈ పోటీలను నిర్వహిస్తారన్నారు. అజ్మీర్‌లో జరగబోయే పోటీల్లో బౌలింగ్, బ్యాటింగ్‌లలో శాయశక్తులా కృషి చేసి మంచి ప్రదర్శనతో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తానన్నారు.

## అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఐడీపీఎస్ విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్

చాపాడు, ఫిబ్రవరి 1: ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ముగ్గురు రోలర్ రిలే స్కేటింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఎంపికైన వారిలో అండర్-8 విభాగంలో దీక్షిత్, అండర్-10 విభాగంలో నక్షత్ర, మోక్షజ్ఞ ఉన్నారు. శ్రీలంకలో త్వరలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన చెప్పారు. వీరు గోల్డ్‌మెడల్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, సీబీఐటీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, పీఈటీ టీచర్ హర్షం వెలిబుచ్చారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా

కడప (క్రైం), ఫిబ్రవరి 1 : మద్యం తాగి మోటారు సైకిలు నడుపుతూ పోలీసుల తనిఖీలో పట్టుబడిన వ్యక్తికి 15 రోజుల జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ కడప స్పెషల్ జేఎస్‌సీఎం కోర్టు తీర్పునిచ్చినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కడపకు చెందిన కొప్పుల మనోజ్‌కుమార్ జనవరి 30న మద్యం తాగి మోటారు బైకు నడుపుతూ పట్టుబడ్డాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా జైలుశిక్ష, జరిమానా విధించినట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెద్దముడ్యం, ఫిబ్రవరి 1: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ టోపిసాబ్ (25) అనే యువకుడు మృతి చెందినట్లు పెద్దముడ్యం పోలీసులు తెలిపారు. పెద్దముడ్యం మండలం పాపేపల్లి గ్రామ పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లికు చెందిన టోపీసాబ్ అతడి స్నేహితుడు షంషద్దీన్‌తో కలిసి స్వంత పనులపై ద్విచక్రవాహనంలో మండలంలోని కలిచెర్లకు వెళ్లి వస్తుండగా బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లికు చెందిన నసీమ్ (25) ద్విచక్రవాహనంలో వస్తుండగా కలిచెర్ల వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయమైన టోపిసాబ్‌ను తిరుపతికి రెఫర్ చేయగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు.

## అల్లుడి హత్య కేసులో మామకు జీవిత ఖైదు



బాపతి సంజీవరెడ్డి (ఫైల్)

కడప(రూరల్)/కాశినాయన, ఫిబ్రవరి 1 : అల్లుడు రాజేష్‌రెడ్డిని హత్య చేసిన మామ బాపతి సంజీవరెడ్డి (49)కి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ గురువారం ఆరవ అదనపు కోర్టు జిల్లా జడ్జి ఎస్.ఇంతియాజ్ అహమ్మద్ తీర్పునిచ్చారు. 2018 ఆగస్టు 5న కాశినాయన మండలం కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన బాపతి సంజీవరెడ్డి (49) అతడి రెండవ అల్లుడైన బి.మఠం మండలం నరసన్నపల్లికి చెందిన పి.రాజేష్‌రెడ్డిని కుటుంబ కలహాల కారణంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ మేరకు మృతుడి స్నేహితుడైన కోనేటి గురుబ్రహ్మం కాశినాయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు హత్య కేసుగా నమోదు చేశారు. అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ వేసి ఆరవ అదనపు జిల్లా కోర్టులో నేర విచారణ నిర్వహించారు. ఈ మేరకు నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

## 310 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు, నిందితులతో సీఐ నరసింహారెడ్డి

కడప (క్రైం), ఫిబ్రవరి 1 : కడప నగరం తాడిపత్రి-తిరుపతి బైపాస్ రోడ్డులోని దేవునికడప ఆర్చి వద్ద పుదుచ్చేరి మద్యం బాటిళ్లు అమ్ముతున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కమలాపురం మండలం చిన్నపుత్త గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన పెనుగొండ సిద్దగురు ప్రస్తుతం వీరపునాయునిపల్లె మండలంలోని అనిమెల గ్రామంలో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ మద్యం బాటిళ్లు బైపాస్ రోడ్డు వద్ద విక్రయిస్తుండగా ఎస్ఐలు రవికుమార్, మహ్మద్‌రఫీలతో కలిసి దాడులు చేసి ఈ మేరకు వారిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న లగేజీ బ్యాగుల్లోని 310 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. ఈ మేరకు వారిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

- 2 లక్షల విలువ చేసే 40 కేజీల గంజాయి స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామచంద్ర

కడప (క్రైం), ఫిబ్రవరి 1 : కడప నగర శివారులోని డీటీసీ సర్కిల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ కె.రామచంద్ర తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. కడప భాగ్యనగర్ కాలనీకి చెందిన సురభి మహేశ్, రాజారెడ్డివీధికి చెందిన షేక్ ఖాజావల్లి, మృత్యుంజయకుంటకు చెందిన శేఖర్ ఇతర ప్రాంతాల నుంచి లారీల ద్వారా గంజాయి తీసుకువచ్చి వాటిని కడపలో విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆదేశాల మేరకు ఎస్ఐ నారాయణ సిబ్బందితో దాడులు చేసి వారిని అరెస్టు చేసి 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు.

## అన్నమయ్య జిల్లాకు 45 కొత్త బస్సులు



అధికారులతో మాట్లాడుతున్న డీపీటీవో రాము

పీలేరు, ఫిబ్రవరి 1: అన్నమయ్య జిల్లాకు ఈనెల 15వ తేదీలోపు 45 కొత్త బస్సులు రానున్నట్లు అన్నమయ్య జిల్లా డీపీటీవో రాము తెలిపారు. పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కొత్తగా వస్తున్నాయని తెలిపారు. కొత్త వాటిలో పీలేరు డిపోకు నాలుగు కేటాయించనున్నట్లు వెల్లడించారు. పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో సుమారు 15 ఎకరాల భూమి ఖాళీగా ఉందని, 5, 15 సంవత్సరాల లీజు పద్ధతిలో ఆసక్తి గల వారికి అద్దెకివ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో గత ఏడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎం బండ్లకుమార్, సీఐ సుబ్బన్న, బస్‌స్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, ఏడీసీలు హనీఫ్, పీఎస్ఎం రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం దివాళా తీసిందా..

- తక్షణమే ఆర్థిక బకాయిలు చెల్లించాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్



యూటీఎఫ్ దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వం దివాళా తీసిందా అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. తక్షణమే వారికి రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ చేపట్టిన రెండోరోజు దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలతో ఉద్యోగులను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా ఉద్యోగులను వంచిస్తూనే ఉన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే ఓపీఎస్ విధానాన్ని అమలు చేస్తామని మాట ఇచ్చి ఐదేళ్ల కాలయాపన చేసి ఇప్పుడు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించలేమంటూ తోక ముడిచారన్నారు. మెరుగైన వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి జీతాల్లో కోత విధించి చరిత్ర హీనుడిగా మిగిలారన్నారు. కేవలం ఒక్క ఉద్యోగులకే రూ.25 వేల కోట్ల పైబడి బకాయిలు చెల్లించాలంటే ఈ ప్రభుత్వం దివాళా తీసినట్టుందని ఎద్దేవా చేశారు. బటన్ నొక్కడం ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పదేపదే ఆర్భాటంగా ప్రకటించుకున్న ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి బటన్ ఎందుకు నొక్కలేదో సమాధానం చెప్పాలన్నారు. ఈ ప్రభుత్వం రాబోవు ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వై.రవికుమార్, ఎస్.ఎజాజ్ అహ్మద్, ఎల్.చంద్ర ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, సీవీ రమణ, ఎస్.ఓబురెడ్డి, రూతు ఆరోగ్యమేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ టీచర్లపై వివక్ష చూపుతున్న ప్రభుత్వం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్యాంసుందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులను ప్రభుత్వ పరిధిలోకి తీసుకుని సర్వీసు రూల్స్ రూపొందించకపోవడంతో వారిని త్రిశంకుస్వర్గంలో ఉంచినట్లయిందన్నారు. మున్సిపల్ టీచర్లకు సర్వీసు రూల్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు. అలాగే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. పీఎఫ్ సౌకర్యం కల్పించాలని మున్సిపల్ పాఠశాలలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఎంఈఓలను ఉప విద్యాధికారులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు క్రిష్టారెడ్డి. జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు రమేష్‌రెడ్డి, సుబ్బయ్య, అక్తర్‌బాషా పాల్గొన్నారు.

## టీడీపీతోనే అభివృద్ధి : పుత్తా

100 కుటుంబాలు టీడీపీలో చేరిక



రసూల్‌పల్లెలో టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి తదితరులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 1: తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డిపల్లె పంచాయతీ, రసూల్‌పల్లె పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో గురువారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రతి ఇంటికి తిరిగి మహిళలకు వివరించారు. బాబు చేపట్టిన పథకాలు మహిళలను చైతన్యపరుస్తూ వారి అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. వివిధ గ్రామాల్లో 100 కుటుంబాలు పుత్తా సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణకిశోర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు కోసం 4న 'విశాఖ దీక్ష'

పీలేరు, ఫిబ్రవరి 1: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న విశాఖలో 'ఓట్ ఫర్ ఓపీఎస్, సాగర సంగ్రామం' పేరుతో నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీఎస్ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. పీలేరులోని ఏపీసీ పీఎస్ఈఏ కార్యాలయంలో గురువారం ఆయన విశాఖ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కేవలం వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నన్నాళ్లూ దాని గురించి పట్టించుకోలేదన్నారు.

## నేటి నుంచి లూర్దుమాత తిరునాల

కడప (కల్చరల్), ఫిబ్రవరి 1 : కడప మరియాపురంలో వెలసిన లూర్దుమాత తిరునాల మహోత్సవాలు ఈ నెల 2వ తేదీ శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు కన్నులపం డువగా జరగనున్నట్లు మరియాపురం కేథడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ బిరుసు రాజా పేర్కొన్నారు. గురువారం స్థానిక మరియాపురంలోని లూర్దుమాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో తొలుత తిరునాలకు సంబంధించిన కరపత్రా లను ఆవిష్కరించి తదుపరి మాట్లాడారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు లూర్దుమాత చర్చి నందు ప్రత్యేక నవదిన పూజా ప్రార్థనలు జరుగుతాయన్నారు. ఆ కోవలో ఈ నెల 10వతేదీన శనివారం సంధ్యా సర్కిల్ సమీపంలోని డాన్‌బోస్కో ఐటీఐ నుంచి సీఎస్‌ఐ చర్చి, ఎన్టీఆర్ సర్కిల్, సెవెన్‌రోడ్స్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, రామక్రిష్ణ జూనియర్ కాలేజీ మీదుగా మరియాపురం ప్రధాన దారి వెంబడి పాత గుడి వరకు ఊరేగింపు జర గనుందన్నారు. 11న ఆదివారం మరియాపురం చర్చి ఆవరణంలో యువకులకు వాలీబాల్‌తో పాటు వృషభరా జములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామ న్నారు. పదిరోజుల పాటు జరగనున్న లూర్దుమాత ఉత్స వాలకు జిల్లాలోని అన్నివర్గాల ప్రజలు కులమతాలకతీ తంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### 'బీజేపీపై విమర్శలు తగదు'

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 1 :బీజేపీపై విమర్శలు తగదని వైఎస్ షర్మిలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శశి భూషణ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఎన్జీఓ కాలనీ లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏం ఇచ్చిందంటూ షర్మిల వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా నిజానిజాలు తెలుసుకుని మాట్లాడితే సబబుగా ఉంటుందన్నారు.

## బూత్ కమిటీ అధ్యక్షులు మరింత చురుగ్గా పనిచేయాలి :టీడీపీ


చెన్నూరు టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు నరేన్

చెన్నూరు, ఫిబ్రవరి 1 : మండల వ్యాప్తంగా అన్ని బూత్ కమిటీల అధ్యక్షులు రాబోవు ఎన్నికలకు సంబం ధించి మరింత చురుగ్గా పనిచేయాలని టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన నరేన్ అన్నారు. చెన్నూరు టీడీపీ కార్యాలయంలో గురు వారం బూత్ కమిటీ అధ్య క్షులతో సమావేశం నిర్వ హించి మాట్లాడారు. ప్రతి బూత్ కమిటీ అధ్యక్షులు వా రే కాకుండా వారి పరిధిలో ఇంకా యాక్టివ్‌గా ఉండే వ్యక్తులను పార్టీ కోసం తీసుకోవాలని, తద్వారా పనులు తేలికగా ఉంటా యన్నారు. ప్రతి పనిని ఆబాధ్యతాయుతంగా తీ సుకోవాలని, ఓటర్ల జాబితాను పరిశీలించడం, దాంట్లో తప్పులు చూడడం, ఇంకా మార్పులు చేర్పులు, వలసలు లాంటి వాటిని గుర్తించాల న్నారు. ప్రతి ఓటరు కీలకమని, బూత్ కమిటీ కన్వీనర్లు వారి వారి పరిధిలో తటస్తులను గు ర్తించి వారిని పార్టీ వైపు మళ్లేటట్లు చూడడం, పార్టీ మేనిఫెస్టో పథకాలను వివరించడం, వాటి ద్వారా జరిగే లబ్ధి తెలపడం ముఖ్యమన్నారు. పార్టీలో ఇప్పటి వరకు అధ్యక్షుడు, కార్యదర్శులుం దరూ పనిచేస్తుంటారని, వీరి కన్నా బూత్ కమిటీ అధ్యక్షులే కీలకమన్నారు. అ ందుకే పార్టీ వారిపై మరింత బాధ్యత పెట్టిందన్నారు. పార్టీ విజ యానికి వారు అందించే సేవలు మూలమన్నారు. కావున ప్రతి బూత్ కమిటీ కన్వీనరు తన పరి ధిలో టీడీపీకి ఎక్కువ ఓట్లు వచ్చేటట్లు చూ డడంతో పాటు నిత్యం ఇళ్ల వద్దకు వెళ్లి ఓటర్లతో మాట్లాడాలన్నారు.

ఎప్పటికప్పుడు వారి పరిధిలోని సమాచారాన్ని నియోజకవర్గ, జిల్లా స్థాయి నేతలకు తెలపాల న్నారు. కార్యక్రమంలో ఐ-టీడీపీ నేత బిట్టి ఆది, యామల మణికంఠ, మైనార్టీ సెల్ జిల్లా నాయ కులు షబ్బీర్‌హుసేన్, కొండపేట మాజీ సర్పంచ్ లు మోహన్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం


పులివెందులలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బీటెక్ రవి, రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 1: పులివెందుల అభివృద్ధి, ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని చెన్నారెడ్డి కాలనీ, గాయత్రికాలనీలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ - జన సేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరించారు. వారితో పాటు బీటెక్ రవి సతీమణి లతారెడ్డి మేనిఫెస్టోలోని పథకాలను వివరించా రు. టీడీపీ అధికారంలోకి వస్తే కుటుంబానికి ఏమేర సంక్షేమ ఫలాలు అం దుతాయో క్షుణ్ణంగా వివరించారు. టీడీపీకి ఒక్క అవకాశం ఇవ్వండని అభ్య ర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 3న గండిలో హనుమాన్ లీలా విలాసం

చక్రాయపేట, జనవరి 1: గండి క్షేత్రంలో 3వ తేదీన హనుమాన్ లీలా విలాసం ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ అలవ లపాటి ముకుందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గండి వీరాం జనేయస్వామి దేవస్థానంలో నైమిషారణ్యపీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వ తిచే హనుమాన్ లీలావిలాసం, దేవతా విజ్ఞానం ప్రవచనం ఉంటుందన్నారు.

## విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి


స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 1:విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకో వాలని మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎం ఈఓ వెంకటరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి అవకాశాలను చక్కగా ఉపయోగించుకుని ఉన్నతస్థాయికి చేరి సమా జానికి సేవ చేయాలన్నారు. రాబోయే 40 రోజులు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ పాలు, మజ్జిగ ఎక్కువగా సేవించాలని సూచించారు. కార్యక్రమంలో స్టడీ మెటీరి యల్‌కు సహకరించిన ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బాలగంగిరెడ్డి, రమాదేవిలను అభినందించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 1:చంద్రబాబుతోనే రాష్ట్రాభి వృద్ధి సాధ్యమని తెలుగు మహిళా నియోజ కవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మిదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, బొజ్జ అరుణ పేర్కొన్నారు. గురు వారం వీరబల్లె పంచాయతీ కొత్తచెరవు గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో వారు మాట్లాడారు.

## ప్రాణరక్షణ కల్పించండి

- జిల్లా అధికారులకు ఓ భార్యాభర్త వేడుకోలు


మాట్లాడుతున్న బిందులత

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 1:ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో తనతో పాటు తన భర్తపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కడప రైల్వేస్టేషన్ సమీప శ్రీరామ్‌నగర్‌కు చెందిన పాలెం బిందు లత, ఆమె భర్త సీవీ రమణ రావు జిల్లా అధికారులను కో రారు. గురువారం వారి ఇంటి ఆవరణంలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సంద ర్భంగా బిందులత మాట్లాడుతూ ఇటీవల కొంత మంది రౌడీమూకలు తమ ఇంటి వద్దకు వచ్చి ఇంటిలోని సా మగ్రి, విలువైన దోచుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇంట్లోని ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువులతో పా టు బంగారు వస్తువులను కూడా తీసుకెళ్లారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మా అమ్మ కూడా ఇదే ఇంట్లోనే ని వాసం ఉందన్నారు. ప్రస్తుతం మమ్మల్ని అక్కడ నుంచి ఖాళీ చేసేందుకు కుట్ర జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున జిల్లా పోలీసు అధికారులు స్పందించి న్యా యం చేయాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు దేవ రశ్రీక్రిష్ణ ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రీజనల్ స్థాయి సైన్స్ ఫేర్‌లో కడప విద్యార్థికి ఐదో స్థానం



మెమొంటోతో సత్కరిస్తున్న సమగ్ర శిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసరావు, ఎస్‌సీఆర్‌టీ డైరెక్టరు ప్రతాప్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 : విజయవా డలో జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగిన రీజనల్ స్థాయి సైన్స్ పేర్‌లో కడప జిల్లా సిద్దవటం మండలం లెవెన్త్ బెటాలియన్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీషాకు 5వ స్థానం లభించింది. ఈ విద్యార్థినికి మొమెంటో, సర్టిఫికెట్ ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. శిరీషా మల్టీ పర్పస్ అగ్రికల్చర్ రోబోట్‌ను ప్ర దర్శించారు. పొలాన్ని దున్నడం, విత్తనాలు ఆడడడం, దా నికి ఎరువులు చల్లడం, నేలను అందించడం, వచ్చిన పం టను కట్ చేయడం లాంటివన్నీ ఒకే మిషన్‌తో చేయడం అనేది దీని ప్రత్యేకత. ఇలాంటి వివిధ రకాల పనులను ఒకే చోట చేయడం ద్వారా రైతు లకు అయ్యే వ్యయం తగ్గించవచ్చని విద్యార్థిని ఆలోచన. అలాగే ఐదో స్థానం లభించినందుకు గాను జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి విద్యార్థినిని అభినందించారు.

## ఇష్టానుసారంగా డీకేటీ పట్టాలు ఇవ్వద్దు: ఎమ్మెల్సీ

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 1: ఇష్టానుసారంగా డీకేటీ పట్టాలు ఇవ్వద్దని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పులివెందుల ఆర్డీఓ వెంకటేశులును కోరారు. గురువారం ఆర్డీఓను కలి సిన ఎమ్మెల్సీ వేముల మండలం నల్లచెరువుపల్లె రెవిన్యూ పరిధిలో అనర్హులకు డీకేటీ ఇవ్వాలని ప్రయత్నిస్తున్నార న్నారు. వైసీపీనాయకులు వాటిని చేజిక్కించుకోవాలని చూస్తున్నారన్నారు.గతంలో జరిగిన భూ పంపిణీలో అన ర్హులకు ఇచ్చి, మళ్లీ వాటిని రద్దుచేశారన్నారు. ఎన్నికల ముందు వీటిని ఆపివేయాలని కోరారు. దీనికి ఆర్డీఓ స్పందిస్తూ ప్రస్తుతానికి అలాంటి ఆలోచన లేదని, ఏదైన అసైన్‌మెంట్ కమిటీ ద్వారా జరుగుతుందన్నారు. రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

## వైవీయూ ఎన్ఎస్ఎస్ పీఎలుగా డాక్టర్ లలిత, సుమిత్ర


నియామక పత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 : వైవీయూ ఎన్ఎస్ఎస్ పీఓలుగా సైకాలజీ శాఖ అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ కె.లలిత, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ సుమిత్రను నియమించారు. గురువారం వైవీయు ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి వారికి నియామక పత్రాలు అందించారు. ఈ స్థానా ల్లో ఇది వరకు పనిచేస్తున్న చంద్రశేఖర్, డాక్టర్ వసు గోవర్ధన్‌రెడ్డి, పీవో పోస్టల్‌నుంచి రిలీవ్ అయ్యారు. అనంతరం రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సేవలువిస్తృతం చేయాలని సమాజాన్ని జా గృతం చేసేకార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త వెంకట్రా మిరెడ్డి, పూర్వపు పీవోలు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

కొండాపురం, ఫిబ్రవరి 1: కొండాపురం మండలంలోని చౌ టిపల్లెలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పా ఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. 5వ తరగతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లో చేరేందుకు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 23 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 23న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివ రాలకు 8977759770 నెంబర్‌లో సంప్రదించాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.



### వేతన జీవులకు ఉపశమనం లేదు: ఒంటేరు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతన జీవులకు ఉపశమన చర్యలు ఏమీ కనిపించలేదని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్రగౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివా సులరెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జె ట్‌లో పన్నుల శ్లాబ్‌ల విధానంలో ఎటువంటి మా ర్పులు చేయకపోవడం బాధాకరమన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఉద్యోగుల ఇ టీవల కాలంలో ఖర్చులు పెరిగాయన్నారు. వీటిని పరి గణనలోకి తీసుకుని పన్ను పరిధి పెంచిఉంటే వారికి కొద్దిగా ఉపశమనం లభించేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు పీఆర్సీలో సరైన ఫిట్‌మెంటు ఇవ్వ కపోడంమరో వైపు కేంద్ర ప్రభుత్వం పన్నుల శ్లాబును పెంచకపోవడం వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు.

### బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు వీడ్కోలు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 1: ఎన్నికల బదిలీల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న పెండ్లిమర్రి తహసీల్దార్ ఉదయ్‌భా స్కర్‌రాజును రెవెన్యూ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. మండలాన్ని రెవెన్యూ పరం గా అన్ని విధాలా తన కింది స్థాయి అధికారులు అంద రికి సహకరించి సిబ్బందినంతా బాగా చూసుకునేవా రిని కొనియాడారు. పూలమాల శాలువతో ఘనంగాస త్కరించారు.

### మధ్యతరగతికి ఉపయోగపడే బడ్జెట్

వేంపల్లె, ఫిబ్రవరి 1: కేంద్రమంత్రి నిర్మలా సీతారామ న్ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్యతరగతి ప్రజ లకు ఉపయోగపడేలా ఉందని ప్రైవేట్ జూనియర్ క ళాశాల యాజమాన్య సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు విజయభారతి అభిప్రాయపడ్డారు. గురువారం ఆమె మాట్లాడుతూ వికసిత భారత్‌కు మూల స్తంభాలైన మహిళలు, యువత, అన్నదాతల సాధికారత కోసం ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని, ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణం కోసం హౌసింగ్ స్కీం తీసుకొస్తు న్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన ఇళ్లు లేని నిరుపేదలకు సువర్ణావకాశం అన్నారు. ఆశా, అంగన్వాడీ వర్కర్లకు ఆయుష్మాన్ పథ కం వర్తింపు, ఆయుష్మాన్ భారత్‌కు రూ.7500కోట్లు కేటాయించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి ప్రత్యేక శ్రద్ధ చూపించినట్లయిందన్నారు.

### ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1: కేంద్రం ప్రవేశపెటిన బడ్జెట్‌లో ఉద్యోగ వర్గాలను నిరాశపరిచిందని ఏపీటీఎ ఫ్ అమరావతి రాష్టర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్ర సాద్ ఒక ప్రకటలోవిమర్శించారు. పెరిగిన ధరలు మారిన జీతభత్యాలతో పన్ను శ్లాబుల్లో మార్పులు వ స్తాయని ఆశతో ఎదురు చూసిన ఉద్యోగవర్గాలకు నిరా శే మిగిలిందన్నారు. కనీసం కేంద్రం పొదుపు ప్రోత్స హించే విధంగా సెక్షన్ 80సి పరిధిని విస్తరించకపోడం వల్ల కూడా ఉద్యోగులకు న్యాయం జరగలేదన్నారు.

### కౌన్సిల్ సమావేశాలకు మీడియాను అనుమతించకపోవడం దారుణం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 1: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు మీడి యాను అనుమతించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టీడీపీ కా ర్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన బావమరిది బంగారు రెడ్డిలు మున్సిపాలిటీలో తప్పులు చేయకపోతే ఎందుకు మీడియాను అనుమతించలేదో సమాధానం చెప్పాల న్నారు. ఎక్కడ అసమ్మతి కౌన్సిలర్లు వాదనలు బయ టికి వస్తాయోనని భయపడుతున్నారన్నారు. మున్సి పాటిలో బీసీ మహిళా చైర్‌పర్సన్‌కు ఎలాంటి అధి కారాలు లేకుండా.. ఆమెను కుర్చీకి పరిమితం చేసి సంతకాల కోసం మాత్రమే వాడుకుంటున్నారన్నారు. పెత్తనమంతా ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావ మరిది బంగారురెడ్డిదే అని ఆరోపించారు. ఏకంగా మీడియాను కౌన్సిల్ సమావేశాలకు అనుమ తించ కుండా తానే చెప్పానని చెప్పడం అతని నియతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో రాచ మల్లు నియ తృత్వంపై పోరాడి ఓడిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య, మాజీ కౌన్సిలర్లు వద్ది బాలుడు, అమీర్ బాషా, జీసీ పుల్లయ్యలు పాల్గొన్నారు.

## నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో 'గురుకుల్' విద్యార్థులు


విజయంసాధించిన గురుకుల్ విద్యాపీఠ్ పాఠశాల విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 :బెంగుళూరు యూనివర్శిటీలో జరిగిన 6వ లీప్ కప్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో కడప నగరం గురుకుల విద్యాపీఠ్ విద్యార్థులు అత్యం త ప్రతిభ కనబరిచి జూనియర్స్ గాను, సబ్‌జూ నియర్స్ గాను, సీనియర్స్‌గా వివిధ స్థాయిల్లో ఘన విజయం సాధించారు. ఈ విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, డైరె క్టరు ఎ.మీరాకుమారి, సీఈఓ ఎఎల్ వివేకా నంద, పల్లవి, ప్రిన్సిపాల్ ఎన్.మునిచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.నరసింహ అభినందించారు. భవి ష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత మైన పురస్కారాలను వివిధరకాలైన విజయ సూచికలను సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులంద రికీ ప్రత్యేక శిక్షణ ఇచ్చిన విజయలక్ష్మిని సన్మానించారు.

## వైవీయూలో లీగల్ సెల్ వెబ్‌సైట్ ప్రారంభం


లీగల్ సెల్ వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 : యూని వర్సిటీ సత్వర న్యాయ పరిష్కారం కోసం సమావేత్త వేదికగా లీగల్ సెల్ వెబ్‌సైట్ పనిచేస్తుందని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. గు రువారం వైస్‌చాన్సలర్ చాంబరులో లీగల్ సెల్ వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్శి టీకి సం బంధించి దాఖలైన కోర్టు కేసులను లీగల్ సెల్ పర్యవేక్షిస్తుందని రాష్ట్ర స్థాయి లీగల్ కమిటి స్టాండింగ్ కౌన్సిల్‌తో సంప్ర దించి యూనవర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌కు సహా యక సహకారాలు అందిస్తుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో యోగివేమన యూనివర్సిటీ రిజి స్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

### ప్రొఫెసరు సరితకు వైవీయూ వీసీ అభినందన

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1: భారత ప్రభుత్వం నుంచి డిజైన్‌లో పేటెంట్ స్వీకరించిన వైవీయూ ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసరు పి.సరిత ఆమె బృందాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వై.పీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డిలు అభినందించారు. డాక్టరు సరిత భారత ప్రభుత్వం నుంచి డిజైన్ పేటెంట్‌లో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్ ఆమోదం పొందడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా పరిక రాల రూపకల్పన పేటెంట్ గురించి పి.సరిత వివరిస్తూ తయారు చేసిన పరికరం కార్యాలయాల స మాచారం తీసుకునేందుకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఉ ద్యోగుల అభిప్రాయాన్ని అభ్యర్థిస్తుందని, లక్ష్యాలు రివా ర్డులు మంచి పనితీరు సిద్ధం చేస్తుందన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణ, సేవా దృక్పథం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సమన్వయ కర్త వెంకట్రామిరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1: వైవీయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్రమ శిక్షణ, సేవా దృక్పథం కలిగి ఉండాలని వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా డిగ్రీకళాశాల వి ద్యార్థినులు కళాశాల స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా అన్ని రకాల కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. సేవాదృక్పథంతో విలువలు కలి గిన పౌరులుగా ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాషా, ఎన్ఎస్ఎస్ పీఓ విజయలక్ష్మీదేవి పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు


ఇంటి పత్రాలను అందిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1: అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష అన్నారు. గురువారం కడప నగరం వైఎ స్సార్ ఆడిటోరియంలో నాలుగో విడత నవరత్నాలు పేద లందరికీ ఇంటి పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమానికి ఆయనతో పాటు మేయరు సురేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మా ట్లాడుతూ నాలుగో విడతలో భాగంగా కడపనగరంలోని వివిధ జగనన్న లేఅవుట్‌లలో ఇంటిస్థలాలు పొందిన 720 మందికి మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. కడప కార్పోరేషన్ పరిధిలలో మొదటి విడతలో 20,784 మందికి రెండో విడతలో 922 మందికి మూడో విడతలో 490 మందికి ఇళ్లపట్టాలు మంజూరు చేసి పత్రాలు పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, తహసీల్దారు శివరామిరెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డీఎస్సీ పేరుతో దగా చేసిన సీఎం

- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్



నిరసనలో మాట్లాడుతున్న శివకుమార్

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 1 :మెగా డీఎస్సీ పేరుతో యువతను సీఎం జగన్‌రె డ్డి దగా చేశారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్‌లు తెలిపారు.

25వేల పోస్టుల్లో మెగా డీఎస్సీ విడుదల చేయాలని మినీ డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేయాలని కో రుతూ గురువారం డీవై ఎఫ్ఐ ఆధ్వర్యంలో కడపలో పూలే సర్కిల్ నందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్స రాలు తరువాత ఉసూరుమనిపించేలా 6100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మెగ డీఎస్సీ కోసం ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

కొండాపురం, ఫిబ్రవరి 1: మండలంలోని చౌటిపల్లెలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు. 5వ తరగతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 23 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 23న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8977759770 నెంబర్‌లో సంప్రదించాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ

రాజుపాలెం, ఫిబ్రవరి 1: మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లో గురువారం వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత చెక్కులను ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పొదుపు సంఘాలకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 504 గ్రూపులకు గాను రూ.2.69 కోట్ల చెక్కు అందించినట్లు తెలిపారు. మొత్తం నాలుగు విడతల్లో రూ.10.76 కోట్లు అందించినట్లు తెలిపారు. ఎంపీపీ నారాయణరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు అంజనీకుమారి, ఎంపీడీవో వెంకటరెడ్డి, వెలుగు ఏపీఎం జయరాజ్, జి.రాజారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాశినాయన మండల తహసీల్దారుగా కుప్పయ్య

కాశినాయన ఫిబ్రవరి 1: కాశినాయన మండల తహసీల్దారుగా కె.కుప్పయ్యను నియమిస్తూ కలెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనల పక్రియలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు రామచంద్రుడు నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలోకి చిత్తూరు జిల్లా నుంచి కుప్పయ్య బదిలీపై వచ్చారు.

## సీఐగా దస్తగిరి బాధ్యతల స్వీకరణ



ముద్దనూరు ఫిబ్రవరి 1: ముద్దనూరు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా దస్తగిరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి పదోన్నతిపై బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన సీఐ నరేష్‌బాబును అన్నమయ్య జిల్లాకు వీఆర్‌కు పంపారు.

## ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

కాశినాయన ఫిబ్రవరి 1: రెడ్డికొట్టాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హరితా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఫణి రాజకుమార్ ఆర్థిక సహకారంతో నూతన గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయుడు దాదాపీర్ తెలిపారు. ఆమేరకు గురువారం ప్రదానోపాధ్యాయుడు రవీంద్రబాబు, ఎంఈవో నిర్మల చేతుల మీదుగా గ్రంథాలయాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరిమళజ్యోతి, మహేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

గోపవరం, ఫిబ్రవరి 1: సంపూర్ణ ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని మండల వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రాచాయిపేట గోపవరం ఉన్నత పాఠశాలలో గురువారం కుష్టువ్యాధి నివారణపై ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కుష్టువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో గౌస్, హైమావతి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా సుబ్రహ్మణ్యం బాధ్యతలు



గోపవరం, ఫిబ్రవరి 1: గోపవరం ఎంపీడీవోగా సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీ మేరకు ఆయన నంద్యాల జిల్లా శిరిసిల్ల మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంప్ర దించాలన్నారు.

## వికలాంగుడికి ఆర్థికసాయం

ఖాజీపేట, ఫిబ్రవరి 1: మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన అంజనేయులు అనే వికలాంగుడికి మండల టీడీపీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల కొత్తపేట వద్ద అంజనేయులుకు ప్రమాదం జరిగింది. గురువారం చికిత్స అనంతరం ఇంటికి రావడంతో లక్ష్మిరెడ్డి పరామర్శించి సాయం అందించారు.





# చంద్రబాబుతోనే భవిష్యత్ గ్యారెంటీ..: పుట్టా

మైదుకూరు / మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 1: రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే గ్యారెంటీ అని ప్రజలు ఏకపక్షంగా ఇప్పటికే నిర్ణయించుకున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అక్కులాయపల్లె, విశ్వనాథపురం గ్రామాల్లో ఇంటింటా పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులు పుట్టాకు పూలమాల వేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింట ఆయన తిరుగుతూ వైయస్ జగన్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు భీమయ్య, జనసేన ఇన్‌చార్జ్ మల్హోత్ర, నాయకులు చీకిరి వెంకట సుబ్బయ్య, ఓబులేసు, గుర్రం సత్యం తదితరులు పాల్గొన్నారు.



పుట్టా సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వైసీపీ నాయకులు

### మాజీ ఎంపీపీ కుటుంబం టీడీపీలోకి...

బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అక్కులా యఎల్లె, విశ్వనాధపురం, విశ్వనాధపురం ఎస్సీ కాలనీలలో పుట్టా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రతి ఒక్కరికి తెలియచేశారు. అనంతరం విశ్వనాధపురం ఎస్సీ కాలనీకి చెందిన మాజీ మండలాధ్యక్షురాలు యంగోళ్ల బుజ్జి భర్త వెంకటసుబ్బయ్య తన కుటుంబంతో పాటు మరో 80 కుటుంబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. జనసేన పార్టీ మైదుకూరు ఇన్‌చార్జ్ పందిటి మల్హోత్ర, టీడీపీ మండలాధ్యక్షుడు భీమయ్య, రామచంద్ర నాయుడు, తిప్పిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ వెంకట సుబ్బయ్య, పార్టీ సీనియర్ నాయకులు కటారి క్రిష్ణ, ధనపాల రవి తదితరులు పాల్గొన్నారు.

### దువ్వూరు మండలంలో 40 కుటుంబాలు..

దువ్వూరు మండలం చిన్నసింగనపల్లె ఎస్సీ కాలనీలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరారు. ప్రొద్దుటూరులో మైదుకూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ నివాసానికి చేరుకున్న బొంత సుందర రావు, కటారి జానకిరాముడు, దండు సురేష్, మాదం ఓబులేసు, దేవపుత్రుడు తదితర దాదాపు 40 కుటుంబాల వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. టీడీపీ నాయకులు బోరెడ్డి రమణారెడ్డి, రామలక్ష్మిరెడ్డి, చిన్నసంజీవరెడ్డి, వీరన్న, వీర య్య తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన జగన్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 1: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అబద్దపు హామీలు ఇచ్చి ప్రజలందరిని మోసం చేశాడని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి విమర్శించారు. గురువారం సాయంత్రం జమ్మలమడుగు మండలంలోని అనంతగిరి, అంజనాపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల అభిమానులు భూపేశ్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ముందుగా భూపేశ్‌రెడ్డికి గజమాలతో సత్కరించారు. అక్కడి నుంచి అయ్యప్పస్వామి గుడి దగ్గర బైక్ ర్యాలీ అనంతరం ఎడ్లబండిని నడిపి అనంతగిరి గ్రామంలో మారెమ్మ అమ్మవారు గుడిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నపురాళ్లపల్లె-కన్నెతీర్థం గ్రామాల మధ్య స్టీల్‌ప్లాంట్ నిర్మించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి రెండుసార్లు టెంకాయలు కొట్టి అందరికీ మోసం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఏరోజు స్టీల్ ప్లాంట్ నిర్మించాలని జగన్ అడుగకపోవడం మోసం చేయడమేనన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే శనగలకు కనీస మద్ధతు ధర రూ.6,500 ఇస్తానని చెప్పి రైతులను దగాచేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికి రూ.15 వేలు ఇస్తారన్నారు. ఆడబిడ్డ నిధి ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి స్ర్తీకి నెలకు రూ.1500, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారన్నారు. జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని.. తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఇంటింటికి వెళ్లి కోరారు. మాజీ ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, టీడీపీ నాయకులు జంబాపురం వేమ నారాయణరెడ్డి, రమణారెడ్డి, తలమంచిపట్నం లక్ష్మినాయుడు, మాజీ సర్పంచ్ బాలుగ్రం, ప్రసాద్, రామాంజనేయులు శ్రీరాములు, రామకృష్ణ, నాగరాజు, మారెయ్య, త్రిదేవ్, పొన్నతోట మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ కార్యక్రమానికి ఎడ్లబండిపై ర్యాలీగా వెళుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

# కౌన్సిల్ సమావేశాలకు మీడియాను అనుమతించకపోవడం దారుణం

- మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 1: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు మీడి యాను అనుమతించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన బావమరిది బంగారురెడ్డిలు మున్సిపాలిటీలో తప్పులు చేయకపోతే ఎందుకు మీడియాను అనుమతించలేదో సమాధానం చెప్పాలన్నారు. ఎక్కడ అసమ్మతి కౌన్సిలర్లు వాదనలు బయటికి వస్తాయోనని భయపడుతున్నారన్నారు. మున్సిపాటిలో బీసీ మహిళా చైర్‌పర్సన్‌కు ఎలాంటి అధికారాలు లేకుండా.. ఆమెను కుర్చీకి పరిమితం చేసి సంతకాల కోసం మాత్రమే వాడుకుంటున్నారన్నారు. పెత్తనమంతా ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డిదే అని ఆరోపించారు. ఏకంగా మీడియాను కౌన్సిల్ సమావేశాలకు అనుమతించకుండా తానే చెప్పానని చెప్పడం అతని నియతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో రాచమల్లు నియతృత్వంపై పోరాడి ఓడిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య, మాజీ కౌన్సిలర్లు వద్ది బాలుడు, అమీర్ బాషా, జీసీ పుల్లయ్యలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

## మాట నిలబెట్టుకున్న పుట్టా

- మంచినీటి సమస్యకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేసిన ఎస్టీ కాలనీ వాసులు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 1: తాగునీటి సమస్యను తీరుస్తామని చెప్పి న 24 గంటల వ్యవధిలోనే సొంత డబ్బుతో మోటరు వేసి టీడీపీ మైదుకూరు ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ మాట నిలబెట్టుకున్నాడు. బుధవారం బి.మఠం మండలం డి.అగ్రహారం గ్రామ ఎస్టీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామానికి వచ్చిన పుట్టా సుధాకర్ యాదవ్ అక్కడ ప్రజలు మంచినీటి కోసం అవస్థలు పడుతుండటం ప్రత్యక్షంగా చూసి చలించిపోయారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి మోటరు బిగించి మంచినీరు ఇవ్వడం పట్ల ఆ గ్రామ ప్రజలు హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## భూసమస్యలను పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 1: బ్రహ్మంగారిమఠంలోని స్థానిక తహసీ ల్దారు కార్యాలయ ఆవరణలో స్పందన కార్యక్రమాన్ని అధికారులు చేప ట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, బద్వేలు ఆర్డీవో ఎ.వెంకటరమణ, మండల ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డిలు హాజరయ్యారు. మండంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ భూ సమ స్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. భూసమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఆర్డీవో ఆకుల వెంకటరమణ భూసమస్యల లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు నాగిరెడ్డి, ఎంపీటీసీ మనోహరాచారి, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌బాబును కలిసి ప్రవీణ్‌రెడ్డి



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 1: ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంకు కుటుంబ సమే తంగా వచ్చిన టీడీపీ జాతీయ అధ్య క్షుడు నారా లోకేష్‌బాబును గురువారం టీడీపీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్ చార్జ్ ప్రవీణ్‌రెడ్డి కలిశారు. ఈసం దర్భంగా పార్టీ కార్యక్రమాల గురించి లోకేష్‌తో చర్చించినట్లు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

## విశ్వకర్మ పథకం సామాన్యులకు వరం

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 1: విశ్వకర్మ పథకం సామాన్య ప్రజకలకు వరం లాంటిదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొర్రె శ్రీనివాసులు పేర్కొ న్నారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విశ్వకర్మ పథకం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసదస్సులో మాట్లాడుతూ విశ్వకర్మ పథకంలో సబ్సిడీ పోను తక్కిన రుణం 5 శాతం వడ్డీతో చెల్లించవచ్చన్నారు. దాదాపు 18 చేతి వృత్తులకు సంబంధించి ఎస్సీ, బీసీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యం శరత్‌బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 6న తలనీలాల వేలంపాట

సిద్దవటం, జనవరి 1: మహాశివరాత్రి సందర్భంగా భక్తులు నిత్యపూజయ్యస్వామి వారికి సమర్పించే తలనీలాల వేలంపాటలు ఈ నెల 6న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొండారెడ్డి, దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి మోహన్‌రెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రమైన సిద్దవటం రంగనాయకస్వామి ఆలయ ఆవరణంలో ఈ వేలంపాట జరుగుతుందన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



బాధ్యతలు చేపట్టిన సీఐ రామాంజులు

ఖాజీపేట, ఫిబ్రవరి 1: ప్రతి ఒక్కరు ట్రాఫిక్‌కు సహకరించాలని, అలాకాకుండా ఇష్టానుసారం వాహనాలు అడ్డుపెడితే చర్యలు తప్పవని సీఐ రామాంజులు అన్నారు. గురువారం పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖాజీపేటలో ప్రతి నిత్యం రద్దీగా ఉండడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని.. ప్రజలు, దుకాణదారులు సహకరించాలన్నారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నేటి నుంచి ఆరాధన మహోత్సవాలు

రామాపురం, ఫిబ్రవరి 1: మండలంలోని నీలకంఠరావుపేట సమీపంలో వెలసిన సద్గురు దర్గా స్వామిజీ ఆరాధన ఉత్సవాలు శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2న ఉదయం 8 గంటలకు గంగపూజ, కలశ స్థాపన, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, మహామంగళహారతి, సాయంత్రం గురుపూజ, విష్ణు సహస్రనామార్చన, మంగళహారతి ఉంటుందన్నారు. 3వ తేదీన ఉదయం 7 గంటలకు కలశపూజ, సద్గురు పూజ, రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ, రుద్ర, సద్గురు హోమాలు, మహామంగళహారతి, ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం పల్లకీ మెరవణి ఉత్సవం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ బెంగళూరు వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతాయని వారు తెలిపారు. భక్తులందరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.



## సేవా దృక్పథం అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న దొరస్వామినాయుడు

బద్వేలు, ఫిబ్రవరి 1: విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణతో కూడిన సేవా దృక్పథం అలవరచుకోవాలని వీరారెడ్డి డిగ్రీ కళాశాల సేవా పథకం యూనిట్ సమన్వయకర్త డాక్టర్ ఎం.దొర స్వామి నాయక్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట సుబ్బారెడ్డిలు అన్నారు. గురువారం చెన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతపై స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా బాధ్యత, క్రమశిక్షణ అలవడుతుందని.. సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమాకాంత్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, రత్నమయ్య పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



రికార్డులను పరి శీలిస్తున్న ఎస్పీ

మైదుకూరు, ఫిబ్రవరి 1: రానున్న ఎన్నికల నేపధ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈసందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు రిజిస్టర్‌ను పరిశీలించి, సీఐ మస్తాన్‌ను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ వంశీధర్‌గౌడ్, రూరల్ సీఐ శ్రీనాధ్‌రెడ్డి, ఎస్ఐ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## బీసీల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు సమర్థులు లేరనడం దారుణం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 1: బీసీల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు సమర్థులు లేరని వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు మాట్లాడటం సరికాదని.. ఇది పూర్తిగా ఆత్మవంచనతో మాట్లాడటమేనని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు విమర్శించారు. గురువారం స్థానిక బీసీ సమాఖ్య కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీలో గత పదేళ్లకు పైగా వుంటూ మేయర్‌గా, జడ్పీ చైర్మన్‌గా వున్న సురేష్‌బాబు కడప ఎమ్మెల్యే అభ్యర్థికి సమర్థుడా కాదా అన్నారు. బీసీల ఆత్మగౌరవం దెబ్బతినేలా సురేష్‌బాబు ఆత్మవంచన చేసుకొని మాట్లాడటం సరికాదన్నారు. బీసీ అయిన సురేష్‌బాబుతో వైసీపీ మాట్లాడించటం కుట్ర పూరితం అన్నారు. టీడీపీ, వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఏవైనా బీసీల దగ్గరకు వచ్చేసరికి ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇదంతా టికెట్లు ఇవ్వకుండా మోసం చేసే కుట్రతప్ప మరొకటి కాదన్నారు. బీసీలకు టికెట్లు ఇస్తే సమర్థులు ఎందుకు ముందుకురారో తేలుతుందన్నారు.

## టీడీపీ ప్రభుత్వంతోనే భవిష్యత్తు



మోడంపల్లె ప్రచారంలో పాల్గొన్న మౌనికా రెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రజలందరి భవిష్యత్తు టీడీపీ ప్రభుత్వం రాకతోనే ముడిపడి వుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మోడంపల్లెలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితారెడ్డి, టీడీపీ మాజీ కౌన్సిలర్ కాకి తిరుపతమ్మ, మాజీ కౌన్సిలర్ భాగ్యమ్మ తాటి శ్రీను, ఆవుల దస్తగిరి కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



రోడ్లకిరువైపులా కంపచెట్లను తొలగిస్తున్న విద్యార్థులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 1: కొండుగారిపల్లెలో గ్రామంలో గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కంపచెట్లను తొలగించి శుభ్రం చేశారు. కళాశాల జాతీయ సేవా పథకం కోఆర్డినేటరు మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ అధ్యక్షతన డిగ్రీకళాశాల విద్యార్థులు దత్తత గ్రామమైన కొండుగారిపల్లెలో వారం రోజుల పాటు జరిగే స్పెషల్ క్యాంపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రకాశరావు, పర్వీన్, గురమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్నతోనే రాష్ట్రాభివృద్ధి

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 1: రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగు మహిళా నియోజ కవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మిదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, బొజ్జ అరుణలు పేర్కొన్నారు. గురు వారం మండల పరిధిలోని వీరబల్లె పంచాయతీ కొత్తచెరవు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ రాబోవు ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి తెచ్చి చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, రవీంద్రరెడ్డి, జయసుబ్బారెడ్డి, దాన మయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచారం



దోసెల వ్యాపారికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 1: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలు వివరిస్తూ బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న ప్రచారం నిర్వహించారు. గురువారం పోరుమామిళ్లలోని 12వ వార్డు పరిధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు, టీడీపీ నాయకులు సీతా వెంకట సుబ్బయ్య, ఇమాంహుసేన్, సెట్టెం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.